ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 23 ఏప్రిల్ 2024



అగ్రనేతలు వస్తున్నారు..

అభ్యర్థుల తరపున ప్రచారానికి రంగంలోకి ముఖ్యనాయకులు

- నేడు బీఆర్ఎస్ ప్రచారానికి మాజీ మంత్రి కేటీఆర్
- వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు
- రేపు వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- మడికొండలో 'జనజాతర' సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు
- 25న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ నామినేషన్
- పాల్గొననున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి
- కీలకనేతల రాకతో వేడెక్కుతున్న ఓరుగల్లు రాజకీయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

లోక్‌సభ ఎన్నికల పోరు వేడెక్కుతోంది. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఊపందుకోవడంతో అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో నిలుస్తుండగా.. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఒక సెట్ నామినేషన్ వేశారు. మరో సెట్‌ను 24న వేయనున్నారు. అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే జన జాతర బహిరంగ సభ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 25న తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహణకు కసరత్తు చేస్తుండగా..ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ హాజరుకానున్నారు. ఇదే క్రమంలో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా కేటీఆర్ వరంగల్‌లో ప్రచారంలో పాల్గొననున్నారు. ఇలా ప్రధాన పార్టీలు పోటాపోటీగా సభలు, సమావేశాలు, ర్యాలీలకు ఏర్పాట్లు చేస్తుండటంతో ఓరుగల్లు రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

నేడు ప్రచార పర్వంలోకి కేటీఆర్..

2014, 2015 ఉపఎన్నికతో పాటు 2019లో వరుసగా వరంగల్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించిన బీఆర్ఎస్ ఈ సారి కూడా సత్తా చాటేందుకు ప్రయత్నిస్తోంది. తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా ఉన్న వరంగల్ పోరుగడ్డలో పట్టు సడలకుండా గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. కడియం శ్రీహరి గులాబీ పార్టీకి హ్యాండిచ్చి కాంగ్రెస్‌లో చేరటంతో డీలా పడిన కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. అందులో భాగంగానే పార్టీకి దూరమైన తాటికొండ రాజయ్యను పార్టీలోకి చేర్చుకున్నారు. కేసీఆర్‌తో పాటు కీలక నేతలతో వరంగల్ లోక్‌సభ స్థానంలో ప్రచారం నిర్వహించాలని కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేయగా.. ఆయనకు మద్దతుగా ప్రచారం చేసేందుకు మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్‌కు వస్తున్నారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం డీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం 6గంటలకు వరంగల్‌లోని ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ రెండు సమావేశాలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.

రేపు కాంగ్రెస్ జనజాతర సభ

వరంగల్ లోక్‌సభ సీటుపై కన్నేసిన కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. 2009లో సిరిసిల్ల రాజయ్య ఎంపీగా విజయం సాధించారు. ఆ తరువాత మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ బోణీ కొట్టలేదు. దీంతో ఈసారి పక్కాగా గెలువలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో కావ్య ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సోమవారం మంచి రోజు కావడంతో తొలిసెట్ నామినేషన్ పత్రాలను కావ్య దాఖలు చేశారు. బుధవారం రెండో సెట్ నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా భారీగా జన సమీకరణ చేస్తున్నారు. దీంతో పాటు సాయంత్రం 4గంటలకు మడికొండలో లక్ష మందితో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ఈ సభకు వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల నుంచి భారీగా జనస మీకరణ చేసేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు ప్రత్యేకం గా దృష్టిపెట్టారు. వరంగల్ లోక్‌సభ పరిధిలో రానున్న రోజుల్లో మరో రెండు సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే అవకాశం ఉంది. అలాగే మే మొదటివారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లేదా ప్రియాంక గాంధీలలో ఒకరిని ప్రచారానికి తీసుకవచ్చేందుకు కాంగ్రెస్ అధి ష్ఠానం ప్రణాళిక రూపొందిస్తుంది. వరంగల్‌పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో పార్టీలోని అన్ని

మిగతా 8వ పేజీలో..



హనుమకొండలో తస్లీమా నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించిన అధికారులు
- రూ.10 కోట్లకు పైగా ఆస్తి పత్రాలు స్వాధీనం



హనుమకొండ కాకతీయ కాలనీలోని తస్లీమా నివాసం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 22 : గత నెల లంచం పుచ్చుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెండ్‌కు గురైన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా నివాసంలో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు హనుమకొండలోని తస్లీమా నివాసంతోపాటు ఆమె భర్త గ్రామమైన నల్లగొండలో, భూపాలపల్లి పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ నివాసంలో ఏకకాలంలో దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సోదాల్లో ప్రభుత్వ విలువ మేరకు రూ.2 కోట్ల 94 లక్షల 84 వేల 547 కాగా, బహిరంగ మార్కెట్ విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సోదాల్లో ఐదు ఇళ్లకు సంబంధించి పత్రాలు (రూ.2కోట్ల 7లక్షల 426), ఆరు ఖాళీ స్థలాలకు చెందిన పత్రాలు (రూ.12లక్షల 1500), మూడు ఎకరాల స్థలం పత్రం (రూ.20లక్షల 40వేలు), నెట్ క్యాష్ రూ. లక్ష 92వేల 900, బ్యాంక్ బ్యాలెన్స్ రూ.98వేల 787, ఇంట్లో వస్తువులు (రూ.9 లక్షల 4,800), వాహనాలు (రూ.23లక్షల 66,218) తదితరాలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తస్లీమాకు బెయిల్ పిటిషన్ వేసే క్రమంలో ఈ దాడులు జరగడం విశేషం. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు మరో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. మొత్తంగా సస్పెన్షన్‌కు గురై జైల్లో ఉన్న క్రమంలో ఆమె నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించడం రిజిస్ట్రేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.



ఆర్ట్స్ కళాశాలలో వాకర్‌ను ఓటు అడుగుతున్న అరూరి రమేష్

వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22 : వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం ఉదయం అరూరి రమేష్ వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ఓట్లు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనలో దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉందని, అందుకు మరోసారి బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ కృషితో వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ, అమృత్ పథకాలతో పాటు కాజీపేటలో రైల్వే వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావుతో పాటు జిల్లా బీజేపీ నాయకులు ఉన్నారు.

25న నామినేషన్ : అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 22 : వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అరూరి రమేష్ ఈ నెల 25న నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి హాజరుకానున్నారు. ఈ క్ర మంలో సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్ లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అరూరి రమేష్ మాట్లాడుతూ 25న హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి తాను నా మినేషన్ వేయనున్నానని, ఈ కార్యక్రమానికి ఉత్త రాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి హాజ రవుతారని వెల్లడించారు. తాను ప్రచారానికి వెళ్లిన స మయంలో జనం నుంచి విశేష స్పందన వస్తోంద ని, వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని గెలవబోతున్నా మని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హను మకొండ, వరంగల్ జిల్లాల బీజేపీ అధ్యక్షులు రావు పద్మ, గంటా రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌తో పాటు రెండు జిల్లాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమవారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 40.0°C | కనిష్ఠం : 25.5°C

లింగనిర్ధారణ పరీక్ష చేసిన ఇద్దరు వైద్యులపై కేసు



నెక్కొండ, ఏప్రిల్ 22 : లింగనిర్ధారణ పరీ క్షలు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులపై కేసు నమోదు చేస్తున్న నెక్కొండ ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడోసారి గర్భం ధరించడంతో పుట్టబోయేది ఆడ, మగ బిడ్డ అనే విషయం తెలుసుకునేందుకు నెక్కొండలోని ఉపేందర్ ఆస్పత్రికి వచ్చారు. ఈనెల 17 వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పార్థు ఆడ పిల్లని నిర్ధారించాడు. దీంతో ఆ గర్భిణి అబార్షన్ చేయించుకొనుటకు నెక్కొండలోని శ్రీవెంకటేశ్వర గ్రామీణ వైద్యశాలకు రాగా, గ్రామీణ వైద్యుడు నమస్కారం అబార్షన్ చేశారు. వైద్యం సరిగా చేయకపోవడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో చికి త్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ఈ విషయమై విచారణ జరిపి గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.యమున నెక్కొండ పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



పోచమ్మ మైదాన్‌లో తనిఖీల్లో పట్టుబడ్డ డబ్బును స్వాధీనం చేసుకుంటున్న ఏసీపీ నందిరాం నాయక్

రూ. 3.39లక్షల నగదు పట్టివేత: ఏసీపీ

మట్టెవాడ, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సోమవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేట రోడ్డు, పోచమ్మమైదాన్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు ను పోలీసులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో రూ.3.39లక్షల నగదు స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వరం గల్ బ్యాంకు కాలనీకి చెందిన తాటికొండ రవికాంత్ రూ.66 వేలు, కేదియా ప్రతీక్ రూ.2.73లక్షలు పర్చుకున్నట్లు తెలిపారు. స్వాధీన పర్చుకున్న రూ.3.39 లక్షలను ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించామని, తనిఖీల్లో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు మల్లయ్య, మచ్చ శివకుమార్, తుమ్మ గోపి పాల్గొన్నారు.



నామినేషన్ వేయడానికి వచ్చిన సందర్భంగా కడియం కావ్యతోపాటు ఎమ్మెల్యేలు



నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న కావ్య

భారీ మెజారిటీతో గెలిపించండి

- 35ఏళ్ల తర్వాత మహిళకు పోటీ అవకాశమొచ్చింది
- వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య
- నామినేషన్ దాఖలు.. పాల్గొన్న ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 22: వరంగల్ లోక్‌సభకు సుమారు 35ఏళ్ల తర్వాత మహిళకు పోటీచేసే అవకాశం వచ్చిందని, ప్రజలంతా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అభ్యర్థించారు. సోమవారం ఆమె ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, రామకృష్ణ, ఈవీ శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కావ్య మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, తను కూడా మహిళా సమస్యలపైనే ఎక్కువగా పనిచేశానని గుర్తుచేశారు. వరంగల్ అభివృద్ధికి దోహదపడే రైల్వే ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్‌గా అప్‌డేట్ చేసుకోవడం, లెదర్ పార్క్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ఇండస్ట్రీయల్ పార్క్, ఐటీ పార్క్ అభివృద్ధి, ఎడ్యుకేషన్ హబ్ విషయాల్లో పోరాటం చేసి వాటిని తీసుకువస్తాననన్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎలాగైతే ఓటేసి ఎమ్మెల్యేలను గెలిపించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారో అలాగే, ఇప్పుడు కూడా కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయాలని కోరారు. మీ ఇంటి ఆడబిడ్డగా దీవించి, మే 13న ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓటడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందని ప్రజలు గుర్తించారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం గనులు, ట్రైబల్ యూనివర్సిటీ సమస్యను పరిష్కరించలేని అసమర్థ పార్టీ బీజేపీ అయితే ఆ పార్టీకి కొమ్ము కాసిన బీఆర్ఎస్ మరో అసమర్థ పార్టీ అని ఆ రెండు పార్టీల వారు ఏముఖం పెటుకుని ఓట్లు అడుగుతారో చెప్పాలన్నారు. వారు వరంగల్ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే ఓట్లు అడాగలన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా కల్లబొల్లి మాటలతో ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నల్లధనాన్ని ప్రతీ ఒక్కరి ఖాతాల్లో వేస్తామని, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్న బీజేపీ ఇవ్వలేదని, అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రం కోసం అమరులైన వారి కుటుంబాలకు ఏం చేయలేదని, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఎస్సీలకు మూడెకరాల హామీలతో ప్రజలను మభ్యపెట్టిదని, బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కతాను ముక్కలేనన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మోసపూరిత మాటలు చెప్పే కుంటికాలు కేసీఆర్ మళ్లీ వస్తున్నాడని, ఓటర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. సబ్బండవర్గాలకు న్యాయం చేసే కాంగ్రెస్‌కే ఓటేసి కడియం కావ్యను గెలిపించాలని కోరారు. మండలానికో గెస్ట్ హౌస్ కట్టుకున్న నాయకుడు ఏకంగా ఏడు నియోజకవర్గాలపై కన్ను వేశాడని, ఆయన తరిమేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ఒకరు, అంబేడ్కర్ విగ్రహాలు లేకుండా చేస్తామని మరొకరు, రిజర్వేషన్లు లేకుండా చేస్తామని ఇంకొకరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీనియర్ నాయకుడు దొమ్మాటి సాంబయ్య మాట్లాడుతూ దేశానికి దిశ దశ చూపించింది కాంగ్రెస్సేనని, బడుగు బలహీన వర్గాల పార్టీ అని అన్నారు. అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న వారికి ఓటర్లు బుద్ధిచెప్పాలన్నారు. రైతునే రాజును చేస్తా అని చెప్పి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి 780 మంది రైతుల మరణాలు కారణమయ్యారని బీజేపీనేతలపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలి..

- రెండు పార్టీలవి మోసపూరిత రాజకీయాలు
- బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ మంత్రి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

మట్టెవాడ, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజే పీ అభ్యర్థులకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నా రు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సుధీర్ కుమార్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సుధీర్‌కుమార్ వెంట శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండాప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు వచ్చి జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద సుధీర్‌కుమార్, దయాకర్‌రావులు మాట్లాడుతూ పదేళ్ల కాంగ్రెస్ పాలన, బీజేపీ పదేళ్ల పాలనలో తెలంగాణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలవి మోసపూరిత రాజకీయాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం మంజూరి చేయడంలో కాంగ్రెస్, బీజేపీలు వరంగల్ ప్రజలను మోసం చేశాయన్నారు. వరంగల్ అజంజాహి మిల్లు కాంగ్రెస్ హయాంలో మూత పడ్డాయన్నారు. దాని స్థానంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేశారన్నారు. ప్రజలను మోసం చేయడంలో వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, కడియం శ్రీహరిలు దిట్ట అన్నారు. విలువ గురించి మాట్లాడే కడియం శ్రీహరి అప్పుడు, ఇప్పుడు ఎలా మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. కడియం, అరూరి చరిత్రను ఉమ్మడి జిల్లా ప్రజలు విశ్లేషించుకోవాలన్నారు. అరూరి రమేష్ భూకబ్జాదారుడని ఎంపీగా గెలిస్తే ఏడు నియోజక వర్గాల్లో భూ కబ్జాలకు పాల్పడుతాడని ఆరోపించారు. మచ్చలేని నీతివంతుడైన, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సుధీర్‌కుమార్‌ని గెలిపించాలని ఎర్రబెల్లి కోరారు.

రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న 108 లైఫ్ సేవియర్లు



అవార్డు అందుకుంటున్న 108 అత్యవసర వాహనం లైఫ్ సేవియర్లు

ఖిలావరంగల్, ఏప్రిల్ 22: 108 అత్యవసర (ఎమర్జెన్సీ) మెడికల్ సేవలకు గాను ఇద్దరు వ్యక్తులు రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశం,స్టేట్ హెడ్ ఆపరేషన్ అధికారి డాక్టర్ ఖలీద్‌ల చేతుల మీదుగా వరంగల్ జిల్లా ఉర్సు కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ క్రాంతికుమార్, పైలెట్ చంద్రసేనాలు రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. వీరిని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, వరంగల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ రామ్, వరంగల్ జిల్లా 108 సిబ్బంది, శాలువా, బొకేతలతో అభినందించారు.

29 నుంచి మే 22 వరకు గోల్కొండ, ఇంటర్ సిటీ రద్దు

గిర్మాజీపేట, ఏప్రిల్ 22: సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో సోమవారం నుంచి ప్రారంభమై మే 26 వరకు జరిగే రోలింగ్ కారిడార్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29 నుంచి మే 22వ తేదీ వరకు వరంగల్ మీదుగా సికింద్రాబాద్, గుంటూరు వెళ్లే గోల్కొండ, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రతీ రోజు వరంగల్ మీదుగా సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 29 నుంచి మే 10 వరకు, తిరిగి మే 16 నుంచి మే 22 వరకు రద్దు చేసినట్లు తెలిపింది.

సికింద్రాబాద్-తిరుపతి రైళ్లు 28 నుంచి రద్దు

ప్రతి ఆదివారం తిరుపతి నుంచి వరంగల్ మీదుగా సికింద్రాబాద్ వెళ్లే, ప్రతి సోమవారం సికింద్రాబాద్ నుంచి వరంగల్ మీదుగా తిరుపతి వెళ్లే సికింద్రాబాద్-తిరుపతి ఏసీ స్పెషల్ రైళ్లను 28 నుంచి మే 6 వరకు, మే 19, 20 తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వరంగల్ మీదుగా ప్రతి శనివారం నర్సాపూర్ నుంచి హైదరాబాద్, ప్రతి ఆదివారం హైదరాబాద్ నుంచి నర్సాపూర్ వెళ్లే ప్రత్యేక రైళ్లను కూడా మే 4 నుంచి 12 వరకు, మే 18, 19 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు.

ఫార్మసీ ప్రాక్టికల్స్‌పై వివాదం

- వర్సిటీ క్యాంపస్‌ను కాదని ప్రైవేట్ కళాశాలలో నిర్వహణ
- వర్సిటీ పరీక్షల విభాగంపై విమర్శలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 22 : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో మరోసారి వివాదం నెలకొంది. ఫార్మసీ ప్రాక్టికల్స్ వర్సిటీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో కాకుండా ప్రైవేట్ కళాశాలలో నిర్వహించడం వివాదాస్పదమైంది. ఏప్రిల్ 18న మూడవ సెమిస్టర్ ఫార్మస్యూటికల్ ప్రాక్టికల్ పరీక్ష కేయూ ఫార్మసీ విభాగంలో జరిగగా. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వెళ్లి తనిఖీలు చేశారు. పరీక్షల్లో అవకతవకలు జరిగాయని భావించారు. తర్వాత అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి ఆయా ఫార్మసీ ప్రాక్టికల్స్ పరీక్షలను రద్దు చేశారు. అక్కడి వరకు బాగానే ఉన్న మళ్లీ అదే పరీక్షలను తిరిగి ఏప్రిల్ 22న సోమవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. అయితే వర్సిటీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం వివాదాస్పదమైంది. ఆయా ప్రైవేట్ అధ్యాపకులు ఎగ్జామినర్స్‌గా వ్యవహరించారు. క్యాంపస్‌లోని సీనియర్స్ ప్రొఫెసర్స్‌ను కాదని ప్రైవేట్ కళాశాల అధ్యాపకులైన ఎగ్జామినర్స్‌తో పరీక్షలు నిర్వహించడం పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే క్యాంపస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు మళ్లీ క్యాంపస్‌లోనే నిర్వహించాలని అభ్యర్థించినప్పటికీ కావాలనే ప్రైవేట్ కళాశాలలో నిర్వహించారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా వర్సిటీ క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలు రాసే విద్యార్థులకు సరైన కెమికల్స్‌తో పాటు ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌లు కొనుగోలు చేయడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఫార్మసీ కళాశాలల అనుమతుల్లో అవకతవకలపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి. ఫార్మసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలకు కావాల్సిన ల్యాబ్‌తో పాటు ఇతర ఎక్విప్‌మెంట్ సెయింట్ పీటర్స్ కళాశాలలో ఉన్నాయని అక్కడే ప్రాక్టికల్స్ పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశామని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి తెలిపారు. అయితే కేయూ ఫార్మసీ విభాగం సూచనల మేరకే ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
మంగళవారం 23 ఏప్రిల్ 2024
7 www.andhrajyothy.com

నామినేషన్ కౌంటర్

నాలుగో రోజు (22-4-2024)

వరంగల్ (ఎస్సీ)
కడియం కావ్య (కాంగ్రెస్),
మారపల్లి సుధీర్‌కుమార్ (బీఆర్ఎస్),
మేకల సుమన్ (ధర్మసమాజ్ పార్టీ),
మచ్చ దేవేందర్ (వీసీకేపార్టీ),
తాళ్లపల్లి వెంకటయ్య, ఈసంపెల్లి వేణు,
మంద నరేశ్, శనిగరపు రమేశ్ (2 సెట్లు),
బొచ్చు రాజు, పొంగుల అశోక్ (స్వతంత్ర)

మహబూబాబాద్ (ఎస్టీ)
అజ్మీర సీతారాం నాయక్ (బీజేపీ),
పగిడి ఎర్రయ్య (యూసీసీఆర్ఐఎంఎల్),
పాల్వంచ దుర్గ (స్వతంత్ర),
మైపతి అరుణ్‌కుమార్ (స్వతంత్ర)

దాఖలైన మొత్తం నామినేషన్లు	వరంగల్	మహ-బాద్
	22	10



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 22 : వర్ధన్నపేట నియోజక వర్గ పరిధిలోని 56వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం హనుమకొండ లోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చేరికల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే నాగరాజు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీశ్, పూర్ణచందర్, రమేశ్‌గౌడ్, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



అసెంబ్లీ సెగ్మెంట్లు ఇవే..

వరంగల్ లోకసభ స్థానంలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, పరకాల, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో కొత్తగా నమోదైన ఓటర్లను కలుపుకొని మొత్తం 18,16,543 మంది ఓటర్లున్నారు.

ఉద్దండుల అడ్డా

హనుమకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల సుపరిపాలనకైనా.. కాకలుతీరిన రాజకీయానికైనా.. కదిలించే పోరాటానికైనా.. చైతన్య వేదిక వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం. 1952లో ఏర్పాటైన ఈ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలతో కలిపి ఇప్పటి వరకు 20 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ మూడు సార్లు టీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. పీడీఎఫ్, సీపీఐ, బీజేఎస్, బీఎల్‌డీ, జనతా, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఒక్కోసారి గెలిచారు. ఇలా.. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఓటర్లు అన్ని పార్టీలను అక్కున చేర్చుకున్నారు. తమ విలక్షణమైన తీర్పు ద్వారా ఆదరించారు. వరంగల్ లోక్‌సభ స్థానం ఒక్కప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా ఓటర్లూ స్పందించారు. ఆ తర్వాత టీడీపీకి, తదనంతరం టీఆర్ఎస్‌కు పెద్దపీట వేశారు. తమకు నచ్చిన అభ్యర్థిని, పార్టీని ఒకటి కన్నా ఎక్కువ సార్లు గెలిపించారు. నచ్చనివారిని ఒక సారికే ఇంటికి పంపారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి రామసహాయం సురేందర్‌రెడ్డి మూడు సార్లు గెలిచారు. ఎస్‌బీ గిరి, చందూలాల్, పసునూరి దయాకర్‌ను రెండేసిసార్లు లోక్‌సభకు పంపారు.

1957లో ఏర్పాటు

1952లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పుడు తొలిసారి జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ పక్షాన పెండ్యాల రాఘవరావు.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావుపై విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో ఎస్ఏ ఖాన్ (కాంగ్రెస్), 1962 ఎన్నికల్లో బీఏ మీర్జా (కాంగ్రెస్), 1967లో రామసహాయం సురేందర్‌రెడ్డి (కాంగ్రెస్) 1971, 1977లో ఎస్‌బీ గిరి ఒకసారి కాంగ్రెస్, ఒకసారి టీపీఎస్ పక్షాన గెలిచారు. 1979లో జరిగిన ఉప ఎన్నికల్లో గండి మల్లికార్జున్‌రావు (కాంగ్రెస్ ఐ), 1980లో కమాలొద్దీన్ అహ్మద్ (కాం గ్రెస్ ఐ), 1984లో టి.కల్పనా దేవి (టీడీపీ) 1989లో, 1991, ఎన్నికల్లో రెండు సార్లు రామసహాయం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) 1996, 1998 ఎన్నికల్లో అజ్మీరా చందూలాల్ (టీడీపీ), 1999 ఎన్నికల్లో బోడ కుంటి వెంకటేశ్వర్లు (టీడీపీ) ఎన్నికయ్యారు


పెండ్యాల రాఘవరావు | కమాలొద్దీన్ అహ్మద్ | టి. కల్పనాదేవి | అజ్మీరా చందూలాల్ | బి.వెంకటేశ్వర్లు

మారిన సీన్

2004లో నుంచి వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో సీన్ మారింది. తెలంగాణ ఉద్యమం ప్రభావం తో టీఆర్ఎస్ ఈ స్థానంలో తన బలా న్ని పెంచుకున్నది. 2004 ఎన్నికల్లో మొదటిసారి టీఆర్ఎస్ విజ యం సాధించింది. ఆ పార్టీ పక్షాన డి.రవీంద్రనాయక్ పోటీ చేసి గెలుపొందారు. అయి తే 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీ పక్షాన పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఏడాదికే 2009 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల రాజయ్య (కాంగ్రెస్) విజయం సాధించారు. 2014 నుంచి వరంగల్‌లో సీన్ మారిపోయింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా టీడీపీని వీడి టీఆర్ఎస్‌లోకి వచ్చిన సీనియర్ నేత కడియం శ్రీహరిని ఓరుగల్లు ఎంపీగా కేసీఆర్ బరిలో దించారు. అలా కడియం వరంగల్ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించారు. ఏకంగా 3.92 లక్షల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కడియంకు 6.61 లక్షల ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్యకు 2 లక్షల ఓట్లు వచ్చాయి. అయితే ఎంపీగా బాధ్యతలు చేపట్టిన కొన్నాళ్లకే రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పులతో కడియం శ్రీహరి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాది తిరక్కుండానే వరంగల్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికల జరిగింది. అప్పుడే పసునూరి దయాకర్‌కు అదృ ష్టం కలిసి వచ్చింది. దయాకర్‌కు 2015లో వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీకి టీఆర్ఎస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. ఈ ఉప ఎ న్నికల్లో దయాకర్ ఏకంగా 4.59 లక్షల ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ద యాకర్ మెజారిటీ తెలంగాణలో ఫస్ట్, బెస్ట్ రికార్డుగా నమోదైంది. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో దయాకర్ టీఆర్ఎస్ నుంచి రెం డోసారి అంతే ఘన విజయాన్ని సాధించారు.

కేంద్ర మంత్రులు

వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ చేసి లోక్‌సభ అడుగుపెట్టిన అభ్యర్థుల్లో ఎవరూ కేంద్రమంత్రులుగా పదవిని అలంకరించకపోయినా రద్దయిన వరంగల్‌లోనూ, ఆ తర్వాత రద్దయిన హనుమకొండ లోక్‌సభ నుంచి పోటీ విజయం సాధించిన వారిలో కొందరు కేంద్ర మంత్రులుగా నియమితులయ్యారు. పీవీ నర్సింహారావు కేంద్ర మంత్రిగానే కాక, ఆ తర్వాత కాలంలో ప్రధాని పదవిని అధిష్ఠించారు. కమాలొద్దీన్ అహ్మద్ కూడా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మారిన సమీకరణలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రభావం వరంగల్ లోక్‌సభ స్థానంపై కూడా పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నందువల్ల ఈసారి ఎన్నికల్లో వరంగల్ కోటపై ఏపార్టీ జెండా ఎరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొన్నది. బీఆర్ఎస్ నుంచి హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ బాబు పోటీలు ఉన్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పోటీకి దిగారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్య రంగంలో నిలబడ్డారు. ఈ నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ ఈసారి రసవత్తరంగా ఉండబోతోంది. ఓరుగల్లు కోటపై ఏ పార్టీ జెండా ఎగుర వేస్తుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది.

సెగ్మెంట్ స్కాన్

- వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానిది విలక్షణ తీర్పు
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట
- తర్వాత టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలకు పెద్ద పీట
- ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇచ్చిన ఓటర్లు
- మహామహులను అందించిన ఓరుగల్లు కోట
- తాజాగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల పోటాపోటీ

హనుమకొండ లోక్‌సభ స్థానం రద్దు

దేశానికి ప్రధానిగా సేవలు అందించిన పీవీ నర్సింహారావు ప్రాతినిధ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం 2009 నుంచి రద్దయింది. 1977 నుంచి ఉన్న హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సైతం రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1977, 1980 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పీవీ నర్సింహారావు పోటీ చేసి పిజనార్దన్‌రెడ్డిపై రెండు సార్లు విజయం సాధించారు. 1984లో బీజేపీ అభ్యర్థి సి.జంగారెడ్డి పీవీ నర్సింహారావుపై విజయం సాధించారు. 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో కమాలొద్దీన్ అహ్మద్ (కాంగ్రెస్) వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. 1985లో, 1999లో టీడీపీ పక్షాన చాడా సురేష్ రెడ్డి రెండు సార్లు, 2004 సాధారణ, 2008 ఉప ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ టీఆర్ఎస్ పక్షాన రెండు సార్లు గెలుపొందారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ లోక్‌సభ స్థానం రద్దయింది.

నియోజవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
స్టేషన్‌ఘనపూర్	1,24,769	1,28,282	02	2,53,053	290
పాలకుర్తి	1,25,952	1,28,496	13	2,54,461	294
పరకాల	1,07,752	1,13,865	02	2,21,619	239
వరంగల్ పశ్చిమ	1,38,607	1,43,251	16	2,81,874	244
వరంగల్ తూర్పు	1,24,809	1,31,634	339	256,782	230
వర్ధన్నపేట	1,33,778	1,38,929	17	2,72,724	278
భూపాలపల్లి	1,36,273	1,39,751	06	2,76,030	317
మొత్తం	8,91,940	9,24,208	395	18,16,543	1,892

నాలుగోరోజూ నామినేషన్ల సందడి

- వరంగల్‌కు 11, మానుకోటలో నాలుగు నామినేషన్లు
- నామినేషన్ వేసిన కడియం కావ్య, సుధీర్‌కుమార్, సీతారాంనాయక్



వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్, నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య


మహబూబాబాద్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌కు నామినేషన్ పత్రాలను అందిస్తున్న బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్ / వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ఉత్సాహంగా సాగుతోంది. నాలుగోరోజైన సోమవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 11 నామినేషన్లు దాఖలవగా మహబూబాబాద్ స్థానానికికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో కాం గ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు, విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ, ధర్మసమా జ్ పార్టీ నుంచి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. వరంగల్ కలెక్టరేట్‌లో పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాల ను స్వీకరించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపల్లి సుధీర్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య, విడుతలై చిరుతైగల్ కచ్చిపార్టీ నుంచి మచ్చ దేవేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, ఇసంపెల్లి వేణు, మంద నరేశ్, బొచ్చు రాజు, శనిగరపు రమేశ్ బాబు (రెండు సెట్లు), పొంగుల అశోక్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమ న్ ఈనెల 20న మొదటి సెట్ నామినేషన్ వేయగా, సోమవారం మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా అరూరి రమేశ్ బుధ వారం నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా అజ్మీర సీతారాంనాయక్, స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ, యూసీసీఆర్ఐఎంఎల్ అభ్యర్థిగా పగిడి ఎర్రయ్య, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ నామినేషన్లు వేశారు. వారు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రిట ర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు తమ నామినేషన్ పత్రాలు అందించారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన పాల్వంచ దుర్గ ఈ నెల 19న కూడ ఒక సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనా యక్ ఈ నెల 19న రెండు సెట్లు వేశారు. దీంతో ఇప్పటి వరకు ఎనిమిది మంది 10సెట్ల నామినేషన్లు వేశారు.

మంచి రోజు కావడంతో..

సోమవారం పౌర్ణమి తిథి ప్రవేశించడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సందర్భంగా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చారు. వరంగల్ కలెక్టరేట్ పరిసర ప్రాంతా లలో ఎన్నికల కోడ్ ఉండటంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులపై బారికేడ్లు ఏ ర్పాటు చేసి నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లే అభ్య ర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే పోలీసులు అనుమతించారు.

రోడ్డుపైనే మీడియా సెంటర్..

వరంగల్ పార్లమెంట్‌కు అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడటానికి కలెక్టరేట్ బయట రోడ్డుపైనే మీడియా పాయింట్ ఏర్పాటు చేశారు. అసలే వేసవి కాలం పెద్ద సంఖ్యలో పోలీసులు, పెద్ద సంఖ్యలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఉండడం పార్టీల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నాయకులు మీడియా పాయింట్‌లోనే సమావేశం నిర్వహించారు. తాగునీరు, తగినన్ని కుర్చీలు లేకపోవడంతో అంద రూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


కడియం కావ్య నామినేషన్ కార్యక్రమంలో సాంబయ్య, రామకృష్ణ తదితరులు

టికెట్ ఆశించినవారే కావ్యకు మద్దతుగా..

- చక్రం తిప్పుతున్న కడియం శ్రీహరి

వరంగల్ సిటీ, ఏప్రిల్ 22: వరంగల్ ఎంపీ సీటును ఆశించిన భంగపాటుకు గురైన ఆశావాహులే సోమవారం కాంగ్రెస్ అభ్యర్థిగా తొలి నామినేషన్ సెట్‌ను దాఖలు చేసిన కడియం కావ్యకు మద్దతుగా నిలువడం ఆసక్తిని కలిగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయ్యాక వచ్చిన ఈ ఎన్నికలు ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం 40మంది దరఖాస్తు చేసుకున్నా, రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్న దొమ్మాటి సాంబయ్యకు వస్తుందని అందరు అనుకున్నారు. అలాగే డాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పెరుమాండ్ల రామకృష్ణ పేరు కూడా తెరపైకి వచ్చింది. అందరి ఊహాలకు చెక్ పెడుతూ వ్యూహాత్మకంగా మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యకు పార్టీ టికెట్ కేటాయించారు. కావ్యకు ప్రకటించినప్పటి నుంచి అలుకబూనిన ఆశావాహులతో కడియం శ్రీహరి జరిపిన చర్చలు ఫలించాయి. ఈ నేపథ్యంలోనే కావ్య నామినేషన్ కార్యక్రమానికి దొమ్మాటి సాంబయ్య, పెరుమాండ్ల రామక్రిష్ణ హాజరయ్యారు. టికెట్ ఆశించిన ఆశావాహులు ఒక్కొక్కరిగా కడియం కావ్యకు మద్దతుగా నిలిచేందుకు ముందుకువస్తుండడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో ఉత్సాహం ఉరుకలేస్తోంది. కాంగ్రెస్ టికెట్ ఆశించిన మిగితా ఆశావాహులతో కడియం శ్రీహరి చర్చలు జరుపతున్నట్లు సమాచారం.

ప్రతిష్ఠాత్మకంగా కాంగ్రెస్ జన జాతర సభ

- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జన సమీకరణకు ఏర్పాట్లు : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే హనుకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి
- సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యేలు

మడికొండ, ఏప్రిల్ 22: మడికొండలో బుధవారం కాంగ్రెస్ జనజాతర సభను ప్రతిష్ఠాత్మంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కే. ఆర్. నాగరాజు, కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పార్టీ నేతలు కూచన రవళి తదితరులతో కలిసి సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా నాయిని విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్‌ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా మడికొండలో జన జాతర సభను నిర్వహిసున్నామన్నారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ధనసరి అనసూయ(సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర నేతలు దీపాదాస్ మున్షీ, రోహిత్ చౌదరి సభలో పాల్గొంటారని తెలిపారు. వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి లక్ష మంది పైచిలుకు జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని చోట్ల మంచినీటి వసతి కల్పిస్తున్నామన్నారు. సభా ప్రాంగణంలో రెండు లక్షల నీటి ప్యాకెట్లు, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అలాగే ప్రతీ నియోజకవర్గం నుంచి వచ్చే వారికి విడివిడిగా పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా పర్యవేక్షిస్తారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లాను ఆరు ముక్కలు చేయడంతో ఇరవై ఏళ్ళు వెనక్కి వెళ్లిందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి జన జాతర సభ దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్ల మోహన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, గుర్రం అమర్‌నాథ్, పల్లపు రాజేందర్, ఏడబోయిన ప్రభాకర్, వస్కుల నాగరాజ్, వస్కుల శ్రీను, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.


సభ ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేలు కె. ఆర్. నాగరాజ్, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



నేడు వీరహనుమాన్ శోభాయాత్ర, బైక్ ర్యాలీ

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 22: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో వీరహనుమాన్ విజయయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ట్లు వరంగల్ మహానగర కమిటీ తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం రంగశాయి పేట మహంకాళి దేవాలయం నుంచి నగర పుర వీధుల గుండా ప్రధాన రహదా రిపై జంక్షన్ల నుంచి హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీతో హనుమకొండలోని హన్మద్గిరి పద్మాక్షి దేవాలయం వరకు ర్యాలీ సాగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా హిందూధర్మ ప్రచారకులు రాధామనోహర్‌దాస్ హాజరై ర్యాలీ ప్రారంభిస్తారని, సామూహికంగా వేలాది మందితో హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందన్నారు.



పెద్దరథంపై ఊరేగుతున్న సీతారాములు

ఘనంగా రథోత్సవం

కరీమాబాద్, ఏప్రిల్ 22: సీతారాముల కల్యాణ మహోత్సవాలలో భాగంగా రం గశాయిపేటలో సోమవారం రథోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున రథబలి నిర్వహించారు. పెద్ద రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి అశ్వ, గరుడ, హంస, శేష, హనుమ వాహనాలతో పాటు ఆంజనేయుడు, లక్ష్మణ సమేతంగా సీతారాములను ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర శివాలయం, గాంధీ విగ్రహం, కటికవాడ, జెండా గద్దె ద్వారా తిరిగి ఆలయానికి చేరుకుంది. వీధుల్లో భక్తులు మంగళహారుతులు పట్టారు. ఉత్సవాలలో నాగబలి, పుష్పయాగం, 12 సేవలు నిర్వహించారు. వేద బ్రాహ్మణులు వెలిదె నరసింహమూర్తి శర్మ,ప్రభాకర్ శాస్త్రి, భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రిలతోపాటు టీడీడీ భజన మండలి, ఆలయ భజన మండలి సభ్యుల సంగీత స్వరాలతో నిర్వహించిన పూజా కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు రమణీయంగా సాగాయి. అనం తరం కంకణ, ధ్వజపట ఉద్వాసనల అనం తరం పవళింపు సేవతో ఉత్సవాలు ముగి శాయి. వేడుకల్లో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిళ్ళ వెంకటరామ నరసింహ శాస్త్రి, వద్దిరాజు రంగారావు, శ్యామ్ సుందర్ రావు, లక్ష్మీకాంతారావు, ఈఓ ఎన్ వెంకట్రావు, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, కొల్లూరి యోగానంద్, వలుప దాసు కృష్ణ, బిట్ల శ్రీనివాస్, బొలుగొడ్డు అనిల్, విలాసాగరం శ్రీనివాస్, శెంకేశి అని ల్, పాలకుర్తి రవళి సుమన్, శిరీష్, కొడిపాక స్వరూప, రమ తదితరులు పాల్గొన్నారు.



'ఓటు వేద్దాం' అవగాహన ర్యాలీ



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఓట్టు వేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గిర్మాజీపేట, ఏప్రిల్ 22: ఎంపీ ఎన్నికల్లో ప్రతి ఓటర్ తన ఓటు హక్కును విని యోగించుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యల క్ష్మి కోరారు. సోమవారం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రతీ ఓటరు ఓటు వేయాలనే నినాదంతోఓటు హక్కుపై వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ జరిగింది. రైల్వేస్టేషన్‌లో స్వీప్ ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ వద్ద భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2018 లోకసభ, 2019, 2023 శాసనసభ ఎన్నికలలో నగ రంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని, మే 13న జరిగే ఎంపీ పోలింగ్‌లో ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రమేష్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి విశ్వజ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మల్లారెడ్డి, సంజీవరావు పాల్గొన్నారు.

అన్నం ఒక చోట.. తినేవారు మరోచోట..

• అన్నార్థులకు అందని రూ.5 భోజనం • తాత్కాలిక బస్టాండ్ సమీపంలోకి మార్చాలని వినతి



పాత బస్‌స్టేషన్‌లో క్యాంటిన్ వద్ద లేని జనం

గిర్మాజీపేట, ఏప్రిల్ 22: వరంగల్ ఆర్టీసీ పాత బస్‌స్టేషన్ ఆవరణలోని వరంగల్ మహానగర పాల క సంస్థ రూ.5భోజనం అన్నపూర్ణ క్యాంటిన్ తినేవా రులేక వెలవెలపోతోంది. బస్‌స్టేషన్‌ను ఎస్ఎన్ఎం క్లబ్ వద్దకు తరలించడంతో ప్రయాణికులంతా అక్క డికి వెళ్తున్నారు. దీంతో పాత బస్‌స్టేషన్ ఆవరణ లోని అన్నపూర్ణ క్యాంటిన్‌కు ఎవరూ రావడం లేదు. వరంగల్ మహానగరంలోని నిరుపేదలు, బాటసారులకు ఆకలి తీర్చేందుకు బల్దియా రూ.5 భోజనం అందిస్తున్న అన్నపూర్ణ క్యాంటిన్‌లు నిత్యం వందలాది ఆకలి తీరుస్తోంది. నగరంలోని జనసం దడి ప్రాంతాలైన వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్, సీకే ఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, శివనగర్, ఎంజి ఎం ఆసుపత్రిలోని రూ.5భోజనం కేంద్రాలు ఉద యం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భోజనం అందిస్తున్నారు. బస్‌స్టేషన్ వద్ద నిత్యం 600 మందికి భోజనం అందిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే, పోయే వారు భోజనం చేసేవారు. అయితే పాత బస్‌స్టేషన్‌ను నూతనంగా నిర్మిస్తున్న నేపథ్యంలో బస్‌స్టేషన్‌ను తాత్కాలికంగా ఎస్ఎన్ఎం క్లబ్ ఎదురుగా రైల్వేగూడ్ షెడ్ సమీపంలోకి తరలించారు. దీంతో పాత బస్‌స్టేషన్‌లోని రూ.5 భోజనం క్యాంటిన్ రద్దీ తగ్గి నిత్యం భోజనం తింటున్నవారి సంఖ్య 250కి పడిపోయినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్ఎన్ఎం క్లబ్ వద్దకు మార్చితే ప్రయాణికుల ఆకలి తీర్చినట్లు అవుతుందని వారంటున్నారు. ప్రయివేట్ హోటళ్ల నిర్వాహకుల ఒత్తిడి మేరకు గ్రేటర్ బల్దియా, ఆర్టీసీ స్థానిక అధికారులు అన్నపూర్ణ క్యాంటిన్‌ను తాత్కాలిక బస్‌స్టేషన్‌కు తరలించేందుకు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భద్రకాళి సన్నిధిలో కావ్య పూజలు



నామినేషన్ పత్రాలతో పూజలు చేస్తున్న కావ్య

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 22: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయంలో వరంగల్ పార్లమెంట్ స్థానా నికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మంచిరోజు కావడంతో నామినేషన్ పత్రా లు దాఖలు చేయడానికి ముందుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలతో కలిసి డాక్టర్ కడియం కావ్య భద్ర కాళి అమ్మవారి వద్ద నామినేషన్ పత్రాలతో పూజ చేసిన అనంతరం నామినేషన్ దాఖలు చేయడానికి వరంగల్ కలెక్టరేట్ కార్యాలయానికి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా కావ్యను అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కడియం కావ్య గెలుపు ఖాయం

గీసుగొండ: వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజారిటీతో గెలువడం ఖాయం అని గీసుగొండ వైస్ఎంపీపీ రడం శ్రావ్యభరత్ అ న్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మంగలి తండా మాజీ వార్డు మెంబర్‌లు భుజంగరావు, వీరన్న, నరసింహ, మంగ్యతో పాటు వీరన్న, భిక్షపతి, గణేష్, డక్క యాకయ్య, 20 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి భరత్ రాంపురంలో కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వర్కాల మోహన్, నాయకులు దర్శనాల రాజు, పేర్ల శ్రావన్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'మేము ఎవరినీ మోసం చేయలేదు'

గీసుగొండ, ఏప్రిల్ 22: ఊకల్‌హవేలి రెవెన్యూ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపా రం చేసి ఎవరినీ మోసం చేయలేదని రియల్టర్‌లు డోలి చిన్ని, కోట రేణుక తెలి పారు. సోమవారం కొనాయిమాకులలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ధర్మారంనకు చెందిన సూర్యనారాయణ తమపై చేసిన ఆరోప ణలు వాస్తవం కాదన్నారు. తాము ఎవరిని చంపుతామని బెదిరించలేదన్నారు. సూర్యనారాయణతో తాము ఇద్దరం కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశామని, భూమి కొనుగోలు, ఖర్చులు, ప్లాట్‌లు అమ్మగా వచ్చిన డబ్బులు మొత్తం లెక్కలు చూసి మిగిలిన భూమిని అతని వాటా ప్రకారం ఇచ్చేలా పెద్దమనుషులు తీర్మా నించారన్నారు. దానికి ఇప్పటికి మేము కట్టుబడి ఉన్నామని, నగదు మాత్రం ఇవ్వ లేమని వారు స్పష్టం చేశారు. తమపై తప్పుడు ప్రచారం చేసిన సూర్య నారా యణపై పరువునష్టం దావా వేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు.

'ప్రజా పాలనను విస్మరించిన ప్రభుత్వం'



కార్యకర్తలతో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

సంగెం, ఏప్రిల్ 22: ప్రజా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని పరకా ల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం సంగెం మండలంలోని నల్లబెల్లి, నార్లవాయి, ముమ్మడివరం, పల్లారుగూడ, వీఆర్ఎన్‌తండ, మొండ్రాయి, బాలునాయక్ తండా, పోచమ్మతండా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమా వేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీ చేరికల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై లేదన్నారు. డిసెంబర్ పోయి 4 నెలలు అయింది, కాంగ్రెస్ ఎన్నికల ముందుఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిం చాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నాయకులు నమ్మగడ్డ వెం కటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, సంగెం వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, నాయకులు మన్సూర్ అలీ, గోవర్ధన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ కార్యదర్శిగా 'నీరటి'

సంగెం, ఏప్రిల్ 22 : తెలంగాణ ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నీరటి సదానందంను సోమవారం నియమించారు. హనుమకొండలోని తన నివాసంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగెం మండలం నల్లిబెల్లి గ్రా మానికి చెందిన సదానందం అనేక ముదిరాజ్ మహా సభ ఉద్యమాల్లో పాల్గొన్న కారణంగా సదానందంకు జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం జరి గిందని బండా ప్రకాష్‌ముదిరాజ్ తెలిపారు.



రామన్నపేటలో బొడ్రాయి పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

'బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి'

కరీబాబాద్, ఏప్రిల్ 22: లోకసభ ఎన్నికల్లో ఓటర్లు బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తు న్న సుధీర్‌బాబు సోమవారం నామినేషన్ వేసిన సందర్భంగా ఉర్సు నుంచి డివిజ న్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. 42వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కొం తం మోహన్ ఆధ్వర్యంలో నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతమ్, శెట్టి మోహన్, సాదుల రంజిత్, వంగరి సురేష్, చంద్రకళ,బాబు, పోలేపాక రాజన్‌బాబు, పరికిపండ్ల ఈశ్వ రయ్య, ఆవునూరి లక్ష్మీ, మండల సురేష్, శెంకేశి రాధిక పాల్గొన్నారు.

- వరంగల్ చౌరస్తా: బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సుధీర్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్‌శ్రేణులు తరలాయి. సోమవారం 29వ రామన్నపేట డివిజ న్ నుంచి దాదాపు వంద మంది కార్యకర్తలు బొండ్రాయి పూజలు నిర్వహించి తరలివెళ్లినట్లు ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సదాంత్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగెం, ఏప్రిల్ 22 : చింతల పల్లిలో సోమవారం తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో రవీందర్ లు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కిష న్, కార్యదర్శి రాజ్‌కుమార్, సీసీ సురే ష్, శత్రజ్ఞడు కమిటీ సభ్యులు కవిత, రాధిక, మంజుల, లక్ష్మీ, విజయ, యాకయ్య, శ్రీను, భద్రయ్య పాల్గొన్నారు.

'విద్యుత్ సరాఫరాలో నిర్లక్ష్యం తగదు'

సంగెం, ఏప్రిల్ 22: విద్యుత్ సరాఫరాలో నిర్లక్ష్యం చేయకుండా వినియోగదారు లకు మెరుగైన సేవలను అందించాలని ఎస్ఈ పి. మధుసూదన్ సిబ్బందికి సూ చించారు. సోమవారం కాపులకనపర్తి, పర్వతగిరి సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బంది శిక్షణ శిబిరంలో మాట్లాడారు. సిబ్బంది నిరంతర విద్యుత్ సరఫరా, విద్యు త్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్, లైన్స్ మెయింటెనెన్స్, విద్యుత్ బిల్లులతోపాటు పలు అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు. పంటలు ఎక్కడ ఎండిపోకుండా రైతులకు విద్యుత్‌ను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి, ఏడీలు నర్సింహ రావు, చంద్రమౌళి, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు మధుసూ దన్, తిరుపతిరెడ్డి, రవి, సబ్ ఇంజనీర్లు క్రాంతి, తానుజావుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ-ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం



ఎల్బీనగర్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 22: మతోన్మాదాన్ని రెచ్చగొ డుతూ పాసిస్టు విధానాలను అమలు చేస్తున్న బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలని సీపీఐ-ఎంఎల్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు గంగుల దయాకర్ డి మాండ్ చేశాడు. సోమవారం ఖిలావరంగల్ చెమన్ వద్ద సీపీఐ-ఎంఎల్ పార్టీ 55వ, ఆవిర్భావ దినోత్సవా న్ని, అలాగే ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత కామ్రేడ్ లెనిన్ 154 జయంతిని ఘనంగా నిర్వహించా రు. మేరకు కోటేశ్వర్‌రావు ఎర్ర జెండాను ఎగురవేసి మాట్లాడుతూ కేంద్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఫాసిస్టు విధానాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్ర మంలో రావుల బాలరాజు, పీవైఎల్ జిల్లా నాయకు డు గంగ్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, వీరన్న, గద్ద ల ప్రభాకర్, రాజు, ఎమ్డీ అక్బర్, చంద్రమౌళి పాల్గొ న్నారు. శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఆధ్వర్యంలో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వరం గల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఏఐవై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కా సుధీర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ యాకూబ్ పాల్గొన్నారు.

- వరంగల్ సిటీ: ఎల్బీనగర్‌లోని న్యూ డెమోక్రసీ పా ర్టీ కార్యాలయంలో లెనిన్ జయంతి, సీపీఐ ఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. జిల్లా నాయకులు నున్న అప్పారావు అధ్యక్ష తన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ఆరె ల్లి కృష్ణ హాజరైన జెండా ఆవిష్కరించారు. కార్యక్ర మంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మర్రి మహేష్, ముషారఫ్, సమీర్, అజిత్, నర్సింహ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అగ్రనేతలు వస్తున్నారు..

5వ పేజీ తరువాయి

వర్గాలు సమ న్వయంతో ముందుకు సాగుతుండటంతో క్యాడర్‌లో ఉత్సా హం ఉరకలేస్తుంది.

బీజేపీ బైక్‌ర్యాలీకి ఉత్తరాఖండ్ సీఎం

వరంగల్ పార్లమెంట్ స్థానంలో పాగా వేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతు న్న బీజేపీ బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకుని, అభ్యర్థిగా బరిలో దింపింది. ఇప్పటికే అరూ రి రమేష్ పార్లమెంట్ పరిధి లోని అన్ని నియోజకవర్గాల కేంద్రా లతో పాటు మండలాలు, గ్రామాల్లో కూడా పర్యటనలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో గెలుస్తామనే నమ్మకం బీజేపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. ప్రధానంగా పట్టణ ఓటరుపై బీజేపీ దృష్టి పెట్టింది.

ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీన బీజేపీ అభ్యర్థి అరూరి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి హాజరుకానున్నారు. అదే రోజు వరంగల్, హనుమకొండ నగరాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మే మొదటి వారంలో హోం మంత్రి అమిత్‌షా లేదంటే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో బహి రంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మే9న లేదా 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించా లని బీజేపీ యోచిస్తుంది. ఇక ఈ సభాపర్వంలో బీజేపీ నేతలతోపాటు ఎంఆర్ పీఎస్ నేతలు పాలుపంచుకోనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు అగ్రనేతలు ఓరు గల్లు బాట పడుతుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నారు. నేతల విమర్శలు, ప్రతి విమర్శలకు తోడు అగ్ర నేతల పర్యటనలు రాజకీయం రసకందాయంగా మారనుంది.



నిందితుడు, సొత్తు వివరాలు చెబుతున్న సీఐ

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

గిర్మాజీపేట, ఏప్రిల్ 22 : వరంగల్, కాజీపేట రైల్వేస్టేష న్‌ల మధ్య రైళ్లలో ప్రయాణికుల వస్తువులను దొంగిలిస్తున్న దుర్గం ప్రశాంత్(32)ను సోమవారం వరంగల్ రైల్వే స్టేషన్ లో అరెస్ట్ చేసి 3.66లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. సోమవారం జీఆర్‌పీలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లా డుతూ ఎన్నికల తనిఖీల్లో భాగంగా పోలీసులు తనిఖీలు చే పట్టగా ప్లాట్‌ఫాం 2, 3లోని చింతల్ వైపు తనిఖీలు చేస్తుం డగా అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీచేయగా బంగారు, వెండి వస్తువులు లభించినట్లు తెలిపారు. విచా రించగా తన పేరు దుర్గం ప్రశాంత్ అని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాలా మండలం గుండాయిపేటకు చెందిన వాడినని, రైళ్లలో ప్రయాణికుల వస్తువులు దొంగిలి స్తున్నట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. నిందితుడు ప్ర శాంత్ నుంచి 2.14లక్షల విలువైన 29.011 గ్రాముల బంగా రు వస్తువులు, రూ.9వేల విలువైన 10 గ్రాముల వెండి బిళ్ల, రూ.3వేల విలువైన చేతి గడియారం, రూ.1.40లక్షల విలు వైన 14 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు ప్రశాంత్‌తో సహ వస్తువులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి



నవీన్(ఫైల్)

సంగెం, ఏప్రిల్ 22: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒకరిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన యువ కుడు ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమ వారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన బదలగాని నవీన్(28) ఆదివారం రాత్రి తన అత్తగారి ఊరై న తీగరాజుపల్లిలో భార్య పిల్లలను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా గవిచర్ల గ్రామ శివారులో ఎదురు గా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. గాయప డిన నవీన్‌ను ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం మృతుడి భార్య ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేశా రు. మృతుడు కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య మూ డేళ్ల కూతురు, రెండు నెలల కుమారుడు ఉన్నారు.

ఘనంగా మున్నూరుకాపు పరపతి సంఘం వార్షికోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 22: విహార యాత్రలతో కుటుం బాల్లో ఉల్లాసం, ఉత్సాహంతోపాటు, నూతన పరిచయాలు పెరుగుతాయని మున్నూరుకాపు పరపతి సంఘం ఖిలావ రంగల్ అధ్యక్షుడు తోట రుక్మయ్య అన్నారు. సోమవారం మున్నూరుకాపు పరపతి సంఘం 12వ వార్షికోత్సవాన్ని ఘ నంగా జరుపుకున్నారు. అనంతరం ఉపాధ్యక్షులుగా ఆకుల కృష్ణ, కార్యదర్శిగా మంద దేవేందర్, సహాయకార్యదర్శిగా మంద కోటేశ్వర్, కోశాధికారిగా తోట వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా ఇనుముల శ్రీనివాస్, బండి సురేందర్, ఆర్గనైజ ర్‌లుగా ముప్ప మధు, బజ్జూరి నాగరాజులను నూతన కమి టీని ఎన్నుకున్నారు.

'ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి'



సదస్సులో మాట్లాడుతున్న రతన్‌సింగ్ ఠాకూర్

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 22: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి గా తగ్గించి ధరిత్రిని కాపాడాలని పర్యావరణ వేత్త రతన్ సింగ్ ఠాకూర్ కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం.. భూగో ళాన్ని రక్షిద్దాం.. అంశంపై ప్రపంచ ధరిత్రి దినోత్సవం సంద ర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమ్యాల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఏవీవీ కళాశాలలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహజ వనరుల వినియోగం, భూమిలో విచ్చలవిడిగా ఖని జాలను వెలికితీయడం, భూ కాలుష్యం, వాయు కాలుష్యం, జల కాలుష్యం ఎక్కువై మనం పీల్చే, గాలి, నీరు, పండించే పంట తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. కార్యక్ర మంలో వినియోగదారుల సంఘం కమిటీ సభ్యులు కాళీ దాస్, సర్వేశం, రాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఖిలావరంగల్, ఏప్రిల్ 22: ఇటీవల గుండెపోటుతో మృ తిచెందిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సీనియర్ గుమస్తా నర్రా అశోక్ కుటుంబానికి ఏనుమాముల గుమ స్తాల సంఘం ఆర్థికసాయం చేసింది. సోమవారం తూర్పు కోటలోని ఆయన నివాసంలో రూ.21వేలు అందజేశారు. కార్యక్రమంలో గుమస్తా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పుప్పాల రాజేందర్, ఉపాధ్యక్షులు ముత్తినేని శ్రీనివాస్, గై ఎల్లయ్య, కోశాధికారి ఇనుముల వైకుంఠం, ఆర్గనైజర్‌లు బొలిశెట్టి సదానందం, కాటన్ సెక్షన్ బొట్టు వేణు, అడ్తి సెక్షన్ మామిడాల వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 23 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

'కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి'

రాయపర్తి, ఏప్రిల్ 22 : వరంగల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ఢిల్లీకి పంపించాలని, తద్వారా రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేలా చూడాలన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణాన్ని తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులు, ఊగ మునిత, మచ్చ రమేష్, భూక్యా సమ్మయ్య, మద్దెల వెంకన్న, రవి, వీరు, రమా తదితరులు పాల్గొన్నారు.

జల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

చెన్నారావుపేట, ఏప్రిల్ 22 : మండలంలోని జల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గోవిందరాజుకు గ్రామవాసి శరణ్య సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శరణ్య మాట్లాడుతూ తనకు జాబ్‌కార్డు ఇప్పిస్తానని మోసంచేశారన్నారు. జాబ్‌కార్డు కోసం రూ.250లను ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి సురేష్‌కు ఇచ్చానన్నారు. జాబ్ కార్డు ఇవ్వలేదన్నారు. అతనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

దుగ్గొండి, ఏప్రిల్ 22 : మండలం వివిధ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు మిషన్ భగీరథ ఏఈ మౌనిక వెల్లడించారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా 51ఆవాస ప్రాంతాలు ఉన్నాయని, 82 ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు, 48 మంచినీటి బావులు ఉన్నాయన్నారు. నీటి ఎద్దడి ఉన్న మైసంపల్లిలో బావి, బోరు, పొనకల్‌లో బావి, చాపలబండలో బావి, దేశాయిపల్లిలో బావి అద్దెకు తీసుకొని నీటి ఎద్దడి సమస్యను తీరుస్తామని తెలిపారు. గ్రామాల్లో నీటీ సమస్య ఉన్నట్లయితే 6309954366కు ఫోన్‌చేసి తెలపాలని ఏఈ కోరారు.

ముదిరాజ్‌లు రవీందర్‌కు న్యాయం చేయాలి

దుగ్గొండి, ఏప్రిల్ 22 : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థుడైన దివ్యాంగుడు సానబోయిన రవీందర్‌కు న్యాయం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామ మత్స్యశాఖ సంబంధించిన కమిటీ ఎంపిక జాప్యంపై ప్రశ్నించిన రవీందర్‌ను గ్రామంలోని కులానికి సంబంధించిన కార్యక్రమాలకు పిలవడంలేదన్నారు. ఏడాదికాలంగా దూరంగా ఉంచుతున్నారని, కుల పెద్దలు కలుగచేసుకొని రవీందర్‌కు న్యాయంచేయాలని కృష్ణ డిమాండ్ చేశారు.

గురుకులాల్లో సీటు సాధించిన విద్యార్థులు



గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థులు

నల్లబెల్లి, ఏప్రిల్ 22: మండలంలోని రామతీర్థం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తెలంగాణ గురుకులాల్లో సీట్లు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సీటు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. పాఠశాల నుంచి కలకోటి జెస్సీ, అక్కపల్లి నక్షత్ర, నవ్య, తనూశ్రీ, సాత్విక్, కీర్తి తెలంగాణ గురుకులాల్లో సీట్లు సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అనూరాధ, పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రగతిలో సంఘాలు ప్రధాన పాత్ర పోషించాలి

చెన్నారావుపేట, ఏప్రిల్ 22 : గ్రామాల్లోని మహిళా సంఘాలు గ్రామ ప్రగతిలో ప్రధాన పాత్ర పోషించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ మునుగాల దయాకర్ అన్నారు. సోమవారం మండలంలోని జల్లిలో గ్రామ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను చైతన్యపరుచడానికి చిన్న సంఘాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, విద్యపరంగా మహిళలకు అన్ని విధాలుగా సంఘాలు ఉపయోగపడతాయని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ ఆరోగ్యానికి పర్యావణాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరయ్య, కో-ఆర్డినేటర్ సుజాత, రజిత, కవిత, అస్మా, చిన్న సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ పై అధికారుల అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 22 : పట్టణంలోని పిరంగిగడ్డ ప్రాంతంలో స్వీప్ కార్యక్రమంపై ప్రజలకు ఎంపీడీవో వెంకటరమణ, మునిసిపాలిటీ కమిషనర్ ఇజోనా, ఎంఈవో నోముల రంగయ్యలు అవగాహన కల్పించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. ఎన్నికల సమయంలో ఈవీఎంలతో పాటు వీవీ ప్యాడ్‌లు ఎంతో ముఖ్యమని ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాజు, మనేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై డేంజర్ బెల్స్!

నిబంధనలకు పాతరేస్తున్న డ్రైవర్లు
ఫ్లై యాష్‌తో ప్రజలు ఇబ్బందులు
ఊపిరితిత్తులకు ఎఫెక్ట్ అంటూ ఆందోళన
పట్టించుకోని ఉన్నతాధికారులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 22 : వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పై గత నెల రోజులుగా డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. వందలాది లారీల్లో వెళ్తున్న డస్ట్ (ఫ్లై యాష్) కారణంగా పగలు, రాత్రి వేళల్లో వాహనాలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. భారీ లారీలు కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వెళ్తుండడంతో ప్రజల ప్రాణాలకు ప్రస్తుతం ముప్పుగా మారింది. వర్ధన్నపేట మండలంలోని జాతీయ రహదారి వెంట ఉన్న ఇండ్లలో నివాసం ఉండేవారు ఈ డస్ట్ కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక లారీల వెనక వచ్చే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు నెలకొని, ప్రమాదాలకు గురవుతున్నారు. తాము ఫ్లై యాష్ బారిన పడకుండా లారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రామగుండం ఫ్లై యాష్ లారీల ఎఫెక్ట్..

పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు వందలాది లారీల్లో ఫ్లై యాష్ తరలిపోతోంది. ఈ క్రమంలో ఖమ్మం ప్రాంతానికి తరలివెళ్తున్న లారీల్లో ఫ్లై యాష్ జారిపడడంతో ఆ బూడిద రోడ్లపై పడి తీవ్రంగా దుమ్ము లేస్తోంది. దీనికారణంగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వ్యక్తులు ప్రమాదాలకు సైతం గురవుతున్నామని చెపుతున్నారు. రహదారి వెంట ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులతో పాటు పెద్ద పెద్ద షాపుల్లోకి సైతం దుమ్ము వెళ్లడంతో దుకాణాదారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రధాన రహదారి వెంట ఉన్న నివాస గృహాల్లోకి బూడిద వెళ్లడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆరోపిస్తున్నారు. ఫ్లై యాష్ రవాణా వల్ల గొంతు సంబంధిత వ్యాధులతో పాటు ఊపిరితిత్తుల బాధతో ఉన్నామని, నేషనల్ హైవే అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడిదీ.. బూడిద..!

రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి ఓ కాంట్రాక్టర్ లారీల ద్వారా ఫ్లై యాష్‌ను ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నట్లు సమాచారం. లైట్ వెయిట్ బ్రిక్స్ తయారు చేసేందుకు, పలు కట్టడాల్లో సిమెంట్‌లో కలిపేందుకు ఈ ఫ్లై యాష్ వినియోగిస్తారు. విద్యుత్ తయారు చేస్తున్న క్రమంలో బొగ్గు (కోల్) నుంచి వచ్చే వేస్టేజీ ఈ ఫ్లై యాష్‌గా చెపుతున్నారు. పగలయితే అభ్యంతరాలు చెబుతారని ఆలోచించిన లారీల డ్రైవర్లు ఎక్కువగా సాయంకాలం నుంచి వీటిని తరలించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు.

నిబంధనలకు పాతర...

జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలు కనీస నిబంధనలు పాటించడం లేదు. లారీల్లో తరలిస్తున్న బూడిద కింద పడుతుందని తెలిసినప్పటికీ అదే తీరుతో వెళ్తున్నారు. ఇటువంటి డస్టును దూర ప్రాంతాలకు తరలించేటపుడు లారీకి దాని బాడీ లెవల్ వరకే లోడు చేసుకోవాలి. ఫ్లై యాష్ బయటకు రాకుండా తార్పాలిన్ల ద్వారా జాగ్రత్తగా ఏర్పాటు చేసి లారీలను గమ్యస్థానానికి తీసుకెళ్లే విధంగా చూడాలి. ఎక్కడైన బూడిద జారి పడుతుందనే విషయం తెలిసినప్పుడు వెంటనే సరిచేసుకోవాలి. ఇవన్నీ పాటించకుండా లారీ డ్రైవర్లు నిబంధనలు పాతరేసి రోడ్లపై నడపడం ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది.

> **జిల్లా సరిహద్దులోనే నిలిపివేయాలి...**
>
> 
>
> **తక్కళ్లపెల్లి శ్రీదేవి, ఇల్లంద గ్రామస్థురాలు**
>
> పోలీసు ఉన్నతాధికారులు, ఆర్టీఏ అధికారులు, నేషనల్ హైవే అధికారులు సంయుక్తంగా ఫ్లై యాష్ లారీలను వరంగల్ ఉమ్మడి జిల్లా సరిహద్దులోనే నిలిపివేయాలి. నిబంధనలు పాటించకుండా వెళ్తున్న లారీల పట్ల చర్యలు తీసుకోవాలి. అక్కడి నుంచి బూడిద వేసుకుంటూ వస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు. రోడ్లపై డస్టును వెదజల్లుతూ వెళ్లడం వలన ప్రాణాలకు ప్రమాదంగా మారింది.



లారీలో తరలిస్తున్న ఫ్లై యాష్‌తో లేస్తున్న దుమ్ము

జరిమానాలు విధించినా.. అదే తీరు..

ప్రజలు రోడ్డు పై ధర్నా చేసిన, పోలీసులు జరిమానాలు విధించినా లారీ డ్రైవర్లు పర్వా నై అంటూ అదే తీరుతో వెళ్తున్నారు. ఈనెల 18న మండలంలోని ఇల్లందలో గ్రామస్థులు రోడ్డు పైకి వచ్చి మా ప్రాణాలు కాపాడాలంటూ ఆందోళన చేపట్టారు. దీంతో స్పందించిన పోలీసులు రామగుండం నుంచి ఖమ్మం జిల్లాకు తరలివెళ్తున్న ఫ్లై యాష్ లారీలను నిలిపి వేసి సంబంధిత పత్రాలు, అనుమతులు పరిశీలించి డస్ట్ వలన కలిగే ఇబ్బందుల పట్ల వారిని వార్నింగ్ ఇచ్చారు. పలు లారీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుండడంతో జరిమానా విధించారు. అయినా అవేమి పట్టనట్లుగా ఇంకా లారీలు ఫ్లై యాష్‌ను అదే తీరుతో తరలిస్తున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వరంగల్ జిల్లా సరిహద్దుల్లోనే వాటిని నిలిపి వేసి నిబంధనలు పాటించేలా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లారీలు వెళ్లడానికి అభ్యంతరాలు లేవని, బూడద రోడ్డుపై పడకుండా చూసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ మాయమాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు



నర్సంపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కవిత

నర్సంపేట, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మేపరిస్థితిలో ప్రజలు లేరని మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. పట్టణంలోని ద్వారక పేటలో గల ఎంఆర్ గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్యే అధ్యక్షతన నర్సంపేటపట్టణ, మండల కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఎన్నికలముందు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రజలను మోసగించడానికి వచ్చే ఆగస్టులో రుణమాఫీ చేస్తామని కాం గ్రెస్ చెబుతున్న మాయమాటలను రైతులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. సాగునీరుఅందక పంటలు ఎండిపోయి రైతులు నానా గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాముని పేరు చెప్పి ఓట్లు దండుకోవడానికి బీజేపీ నాయకులు యత్నిస్తున్నారని కవిత అన్నారు. అందరూ దేవుడి భక్తులేనని పేర్కొన్నారు. నిండుమనసుతో ఆశీర్వదించి గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ ప్రచార కేంద్రాలుగా వినియోగించుకొని రైతుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతామన్నారు. నియోజకవర్గంలో 130 ధాన్యం కొనుగోలు కేం ద్రాలు ఉన్నాయని ఈ కేంద్రాలలో రెండు రోజుల్లో బోనస్ సాధన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే క్వింటల్ ధాన్యానికి రూ:500 బోనస్ అందించే విధంగా ట్రక్ షీట్‌పై రైతులకు రాసిచ్చే విధంగా బోనస్ సాధన కమిటీలు కృషి చేస్తాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎంపీ అభ్యర్థి మాలోతు కవితకు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ అందించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నామాల సత్య నారాయణ, మాజీ ఎంపిపి మోతె కళావతి, మాజీ జడ్‌పిటిసి కోమాండ్ల జయమ్మ, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: కాంగ్రెస్‌పార్టీ మోస పూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మే పరిస్థితిలు లేవని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. సోమవారం నర్సంపేట పట్టణంలోని బీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సన్నహక సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపు ఖాయమన్నారు. అలాగే మండల కేంద్రంలో కోపాకుల చెరువు కింద చివరి ఆయకట్టులో సాగులేక ఎండిపోతున్న వరి పంటలను మాజీ ఎంపీ,బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, మాజీ ఎమ్మె ల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటలు ఎండిన ప్రతీ రైతుకు నష్టపరిహారంను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తినాయక్, తూటీ శ్రీనువాస్, జక్క అశోక్, మాజీ మం డల పార్టీ అధ్యక్షుడు బాల్నె వెంకన్నగౌడ్, బుర్రి తిరుపతి, సొసైటీ వైస్ చైర్మన్ వంశీ,బీఆర్ఎస్ యువనాయకుడు కంది కృష్ణ చైతన్యరెడ్డి, మండలకోఆప్షన్ సభ్యుడు ఎంఏ గఫ్ఫార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సాంబయ్య పాల్గొన్నారు.

● నెక్కొండ : అభివృద్ధి పనులు జరగాలన్నా... అధికారదాహం తీర్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420హామీలు అమలు కావాలన్నా మీ ఆడబిడ్డగా తనను ఓటుతో ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత కోరారు. నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య అధ్యక్షతన సోమవారం నెక్కొండలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజక వర్గం రైతులకు యాసంగి పంటలకు బోనస్‌గా చెల్లించాల్సిన రూ.91 కోట్లు చెల్లించకుండా ఎమ్మెల్యే మాధవరెడ్డి వారికి బకాయి పడ్డారని ఆరోపించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఎమ్మెల్యే మాధవరెడ్డి గతంలో తాను మంజూరి చేయించిన అభివృద్ధి పనులను రద్దు చేయించడమే లక్ష్యంగా పెట్టుకొని అభివృద్ధి నిరోధకుడిగా మారడన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎంపీ అభ్యర్థి మాలోతు కవితకు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జడ్పీటీసీ సరోజన, ఎంపీపీ రమేశ్, సొసైటి చైర్మన్ మారం రాము, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు కొమ్ము రమేశ్, రవీందర్‌రెడ్డి, శివకుమార్, అబ్దుల్‌నభీ, సోమయ్య, సారంగపాణి, రాజీరెడ్డి, సంతోష్, భద్రయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

పర్వతగిరి, ఏప్రిల్ 22 : మండలంలోని తూర్పుతండా, ఇస్లావత్‌తండా గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌పార్టీలోకి చేరారు. వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు.పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచులు ఇస్లావత్ రమేష్‌నాయక్, బానోత్ విజయ, మాజీవైస్ఎంపీపీ బానోత్ రవి, మాజీ ఉపసర్పంచ్ పీర్యా, మాజీ వార్డు సభ్యులు, నాయకులు మూడు సునిత వెంకన్న, మూడు శ్రీనివాస్, నంద్య, బొందాలు, నెహ్రూ, పరుశరాములు, దేవేందర్, సంతోష్, సుమన్ ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బానోత్ సింగులాల్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన కోసమే సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావం



జెండాను ఆవిష్కరిస్తున్న పీవైఎల్, ఏఐకెఎంఎస్ నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 22 : సమసమాజ స్థాపనే లక్ష్యంగా సీపీఐ(ఎంఎల్) ఆవిర్భవించిందని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. సీపీఐ ఎంఎల్ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం లెనిన్ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు యోధుడు లెనిన్ అని ఆయన కొనియాడారు. దేశంలో బూర్జువా విధానాలకు తిలోదకాలులిచ్చి, పెట్టుబడిదారి విధానాన్ని తిరస్కరించి, పార్లమెంటరీ విధానాలకు తిలోదకాలుఇస్తూ సాయుధపోరాటం ఏకైక మార్గమని 1969ఏప్రిల్ 22న సీపీఐ (ఎంఎల్)ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు గట్టి కృష్ణ, సారంగపాణి, మల్ల య్య, వెంకట్ రెడ్డి, సాంబయ్య, ఐలయ్య, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, డివిజన్ కార్యదర్శి అజయ్, పిఓడబ్ల్యు డివిజన్ నాయకులు సౌందర్య, సంధ్య పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో పోరాడాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 22 : మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ స్ఫూర్తితో ప్రజలు సమసమాజ స్థాపన కోసం పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజా పంథా) జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. లెనిన్ 154వ జయంతి, సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నర్సంపేట మండలంలోని మహేశ్వరం, ఇప్పల్‌తండ తదితర గ్రామాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అడ్డూరి రాజు, కత్తుల కొమురన్న, నరేష్, బుచ్చన్న, లింగన్న, కొత్తపల్లి రవి, పైడి మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపులు మూసేయాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 22 : మండలంలోని ఆయా గ్రామాల్లోని బెల్టు షాపులను పూర్తిగా మూసివేయాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. సోమవారం పట్టణంలో పోలీస్ స్టేషన్‌లో గ్రామాల్లోని బెల్టు షాపుల నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన వారిని బైండోవర్ చేశామని, మళ్లీ మద్యం విక్రయాలు చేస్తే జైలుశిక్షతో పాటు జరి మానా విధించే విధంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్ధ న్నపేట సీఐ సూర్యప్రకాష్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 22: ఎంపీ ఎలక్షన్‌లు సమీపిస్తున్న వేళ పోలీసులు అలెర్ట్‌గా ఉండాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం బోల్లోనిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీచేశారు. స్థానిక పోలీసులకు 24గంటలు అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. అంతేకాక తగిన సలహాలు, సూచనలు తెలియజేశారు. డీసీపీ వెంట సీఐ రాజగోపాల్, ఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీజేపీ యువ మోర్చ నర్సంపేట అసెంబ్లీ ఇన్‌-చార్జిగా విఘ్నేష్‌గౌడ్



విఘ్నేష్

నర్సంపేట, ఏప్రిల్ 22 : బీజేపీ యువమోర్చా నర్సంపేట అసెంబ్లీ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన కొంకీ స విఘ్నేష్‌గౌడ్ నియామకమయ్యా రు. ఈమేరకు బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సేవెల్ల మహేందర్ నియమించినట్లు బీజేవైఎం ఆఫీసు కార్యదర్శి కొంపల్లి అరవింద్‌కుమార్ సోమవారం ఉత్తర్వు లను జారీచేశారు. అలాగే కో-ఇన్‌చార్జిగా పెరుమాండ్ల సాయిప్రకాశ్, కో-ఆర్డినేటర్‌గా భరత్‌ను నియమించారు. యువ మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి, కో-ఇన్‌చార్జి, కో-ఆర్డినేట ర్లుగా నియమించిన యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సేవెల్ల మహేందర్‌కు సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేపీ నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మెన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు భరత్ వీర్‌చక్ర, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్‌లకు విఘ్నేష్, సాయిప్రకాశ్, భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 22: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరుపాటు పడాలని ప్రతిభ స్వచ్ఛందసంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపం, వాతావరణ కాలుష్యాలనుంచి ధరిత్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్, పాఠశాల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు



హన్మకొండలో బీజేపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న అరూరి రమేష్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోస పోవద్దని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. సోమ వారం వ ం డ లంలోని ఇల్లందకు చెందిన పలు వురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు హన్మకొండలోని అరూరి రమేష్ నివాసంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా ఉమ్మడి జిల్లా ప్రజలకు సేవ చేసుకునేందుకు అదృష్టం వరించిందన్నారు. కాంగ్రెస్ వస్తే దేశంలో అధోగతి పాలవుతుందని, మోదీతో సుపరిపాలన సాధ్యమని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో అడుప రాజు, మూల రాము, సట్ల రాజు, సట్ల అనిల్, గడ్డం కుమార్, గడ్డల మహేష్, గడ్డం శ్రీనివాస్, కంచె రాజు, వరగంటి నాగరాజు ఉన్నారు. ఇక మండలంలోని ఇల్లందలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి ఆధ్వర్యంలో నూతన ఓటర్లు బీజేపీలో చేరారు.

● పర్వతగిరి: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్‌ల ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వీరికి వరంగల్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో శౌర్య యాకూబ్, బిక్కు, గోపాల్, శివ, రమేష్, చిన్ని, రవికుమార్, పూర్ణచందర్, గౌస్ తదితరులు ఉన్నారు.

అగ్రనేతలు వస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

వర్గాలు సమ న్వయంతో ముందుకు సాగుతుండటంతో క్యాడర్‌లో ఉత్సాహం ఉరకలేస్తుంది. వరంగల్ పార్లమెంట్ స్థానంలో పాగా వే యాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్న బీజేపీ బీఆర్ఎస్ వరంగల్ జిల్లాఅధ్యక్షుడు,వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ను పార్టీలో చేర్చుకుని, అభ్యర్థిగా బరిలో దింపింది. ఇప్పటికే అరూరి రమేష్ పార్లమెం ట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల కేంద్రాలతో పాటు మండలాలు, గ్రామాల్లో కూడా పర్యటనలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో గెలుస్తామనే నమ్మకం బీజేపీ శ్రేణుల్లో కనిపి స్తోంది. ప్రధానంగా పట్టణ ఓటరుపై బీజేపీ దృష్టిపె ట్టింది. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి హాజరుకానున్నారు. అదే రోజు వరంగల్, హనుమకొండ నగరాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లుచేస్తున్నారు. అలాగే మే మొదటి వారంలో హోం మంత్రి అమిత్‌షా లేదంటే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. మే 9న లేదా 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ యోచిస్తుంది. ఇక ఈ సభాపర్వంలో బీజేపీ నేతలతోపాటు ఎంఆర్‌పీఎస్ నేతలు పాలుపంచుకోనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు అగ్రనేతలు ఓరుగల్లు బాట పడుతుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నారు. నేతల విమర్శలు, ప్రతి విమర్శలకు తోడు అగ్రనేతల పర్యటనలు రాజకీయం రసకందాయంగా మారనుంది.

బావిలో పడి వృద్ధుడి మృతి



చంద్రయ్య (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 22 : ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కడారిగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన చెవ్వల్ల చంద్రయ్య(56) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి వర్షం కురిసే అవకాశం ఉందని తెలియడంతో తాను కూలీ పనిచేసే వ్యవసాయ క్షేత్రం వద్ద ధాన్యంపై పరదా కప్పేందుకు వెళ్లాడు. ఈ తరుణంలో బావి పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. చందయ్య తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చంద్రయ్య కోసం గాలించగా, సోమవారం సాయంత్రం కడారిగూడెం శివారులో ఓ వ్యవసాయ బావిలో మృతిచెంది కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య దూడెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కూతురు , కుమారుడు ఉన్నారు.